మా ఇద్దరి మధ్య అసూయ లేదు

వారి అద్భుతమైన నటనతో ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటులు కమల్‌హాసన్, రజనీకాంత్. కుర్ర హీరోలతో పోటీ పడుతూ వరుస సినిమాలు చేస్తూ అలరిస్తున్నారు. వీళ్లిద్దరూ మంచి స్నేహితులనే విషయం తెలిసిందే. తాజాగా తమ మధ్య అనుబంధాన్ని తెలియజేస్తూ కమల్ హాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

'మా స్నేహం ఎన్నోఏళ్లుగా కొనసాగుతోంది. మేమిద్దరం కలిసి గతంలో సినిమాల్లో కలిసి నటించాం. కలిసి సినిమాలు చేయకూడదని ఒక దశలో నిర్ణయించుకున్నాం. మా ఇద్దరికీ గురువు ఒక్కరే (దర్శకుడు కె.బాలచందర్). మా ఇద్దరి మధ్య పోటీతత్వం ఉంది కానీ, అసూయ లేదు. ఇద్దరం రెండు వేర్వేరు మార్గాల్లో ప్రయాణిస్తామంతే. అయినా, ఎప్పుడూ ఒకరి గురించి మరొకరం చులకన వ్యాఖ్యలు చేసుకోలేదు. ఇప్పుడు సీనియర్లం కాబట్టి ఇలా ఉంటున్నాం అనుకోవద్దు. 20 ఏళ్ల నుంచి మేం ఇలానే ఉంటున్నాం' అని చెప్పారు.

హీనా ఖాన్ నువ్వు వారియర్‌వి..

నటికి ధైర్యాన్నిచ్చిన సమంత

తాను స్టేజ్ 3 బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతోన్నట్లు హీనా ఖాన్ ఇటీవల తెలిపిన సంగతి తెలిసిందే. దీంతో సినీ ఇండస్ట్రీలోని ప్రముఖులు ఆమెకు ధైర్యాన్నిస్తున్నారు. తాజాగా హీనా ఖాన్‌ను ఉద్దేశిస్తూ సమంత పోస్ట్ పెట్టారు. హీనాకు సంబంధించిన వీడియో పోస్ట్ చేసిన సమంత 'నీకోసం నేను ప్రార్థిస్తాను. ధైర్యంగా ఉండు' అని రాశారు. దానికి వారియర్ అనే హ్యాష్ ట్యాగ్‌ను జోడించారు. ఈ పోస్ట్‌కు హీనా స్పందిస్తూ.. 'సమంత మీరు అన్నిట్లోనూ స్టార్. జీవితం విసిరిన సవాళ్లను హ్యాండిల్ చేసిన విధానం అద్భుతం. మీ గురించి తెలుసుకొని ఎంతో స్ఫూర్తి పొందాను. మీ ప్రేమ, ఆశీర్వచనాలకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

శ్రీలంకలో యాక్షన్ మొదలు



'కల్కి 2898ఎ.డి' చిత్రంలో అర్జునుడి పాత్రలో కనిపించి ప్రేక్షకుల్ని అలరించారు విజయ్ దేవరకొండ. ప్రస్తుతం ఆయన హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సత్యదేవ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం ఇటీవలే వైజాగ్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. ఇప్పుడు కొత్త షెడ్యూల్‌ను శ్రీలంకలో ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. దాదాపు 40రోజుల పాటు సాగే ఈ సుదీర్ఘ షెడ్యూల్ వచ్చే వారంలో మొదలు కానుంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా విజయ్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు మిగిలిన ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు తెలిసింది. ఆగస్టు చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో చిత్ర బృందం ఉంది. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతోన్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం



ప్రముఖ నటుడు షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం దక్కింది. లొకర్నో ఫిల్మ్‌ఫెస్టివల్ జ్యూరీ ఆయన్ను 'కెరీర్ అఛీవ్‌మెంట్ అవార్డు'కు ఎంపిక చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. "షారుక్‌లాంటి లివింగ్ లెజెండ్‌ను ఆహ్వానించాలనే కల నెరవేరింది. ఆయనో సూపర్‌స్టార్. హీరోగా, ప్రొడ్యూసర్‌గా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేశారు" అని కొనియాడింది. ఈ పోస్ట్‌పై షారుక్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ అభిమాన నటుడికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. లొకర్నో ఫిల్మ్‌ఫెస్టివల్ 77వ ఎడిషన్ ఆగస్టు 7 నుంచి 17 వరకు లొకర్నో (స్విట్జర్లాండ్)లో జరగనుంది. 10న షారుక్‌కు అవార్డు ప్రదానం చేయనున్నారు. ఆయన కెరీర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన చిత్రాల్లో ఒకటైన 'దేవ్‌దాస్'ను ఆ ఈవెంట్‌లో ప్రదర్శించనున్నారు. ఆ పురస్కారానికి ఎంపికైన తొలి భారతీయ నటుడిగా షారుక్ నిలిచారు. ఇంతకుముందు ఫ్రాన్సిస్కో రోసీ, జానీ టో వంటి హాలీవుడ్ ప్రముఖులు ఆ పురస్కారానికి ఎంపికయ్యారు. 32 ఏళ్ల నట ప్రస్థానంలో షారుక్ 100కిపైగా చిత్రాల్లో నటించి, మెప్పించారు. గతేడాది 'పఠాన్', 'జవాన్', 'డంకీ'లతో అలరించిన ఆయన ప్రస్తుతం సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు.

తిరగబడాల్సిన తరుణమిదే

యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో రాజ్ తరుణ్ హీరోగా, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ ఎ ఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న హెల్సమ్ ఎంటర్‌టైనర్ 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయికగా నటిస్తోంది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానరుపై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రం ట్రైలర్ ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన వేడుకలో ఘనంగా ఆవిష్కరించారు!!

టాలీవుడ్‌కు సీఎం రేవంత్ సూచన.. స్పందించిన మోహన్ బాబు

సైబర్ నేరాలు, డ్రగ్స్ కట్టడిపై తెలుగు చలన చిత్ర పరిశ్రమ అవగాహన కల్పించాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ సూచనలపై ప్రముఖ నటుడు మోహన్ బాబు స్పందించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ పెట్టారు. "తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్‌కు యువత బలి అవుతున్న విషయం గురించి మాట్లాడుతూ.. సినిమా నటీనటులను 1 లేదా 2 నిమిషాల నిడివిలో వీడియో చేసి, ప్రభుత్వానికి పంపమన్నారు. ఇంతకుముందే ఇటువంటి వీడియోలు కొన్ని చేశా. అయినా సీఎం ఆదేశం మేరకు సందేశాత్మకమైన కొన్ని వీడియోలు రూపొందించి, ఉడతా భక్తిగా సమాజానికి సేవ చేసుకుంటానని తెలియజేస్తున్నా" అని పేర్కొన్నారు. తన పోస్ట్‌కు రేవంత్, సీఎంఓ ఎక్స్ ఖాతాలను ట్యాగ్ చేశారు.

'తంగలాన్' మ్యూజిక్ పనులు పూర్తయ్యాయి

వైవిధ్యమైన కథలను ఎంచుకునే హీరోల్లో విక్రమ్ ముందుంటారు. ఆయన నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం 'తంగలాన్'. ఈ చిత్రం విడుదల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనిపై సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ అప్‌డేట్ ఇచ్చారు. 'సినిమా మ్యూజిక్ పనులు పూర్తయ్యాయి. నాకు సాధ్యమైనంతవరకు బెస్ట్ మ్యూజిక్ ఇచ్చాను. సినిమా అద్భుతంగా వచ్చింది. త్వరలోనే మైండ్ బ్లోయింగ్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. మరో ఇండియన్ మూవీ చరిత్ర సృష్టించనుంది' అని పేర్కొన్నారు. ఇక ఈ చిత్రాన్ని ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

'తంగలాన్' విషయానికొస్తే.. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాల ఆధారంగా దర్శకుడు పా.రంజిత్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మాళవిక మోహనన్, పార్వతి తిరువొత్తు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే దీని టీజర్‌కు భారీ స్పందన వచ్చింది. ఓ సందర్భంలో విక్రమ్ దీని గురించి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఏ సినిమా కోసం ఇంత కష్టపడలేదన్నారు. విభిన్నకథతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో గ్లామర్‌కు చోటులేదన్నారు. ఈ సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు మరో ప్రపంచంలోకి వెళ్తారని హామీ ఇచ్చారు.

మరోసారి సీమ సింగారమే

కొన్ని పాత్రల్లో కొంతమంది నటుల్ని చూశాక ఆ స్థానంలో మరొకరిని ఊహించుకోలేం. వాళ్ల కోసమే పుట్టాయేమో అనిపిస్తాయి ఆ పాత్రలు. పుష్ప పాత్రలో అల్లు అర్జున్‌ని, శ్రీవల్లి పాత్రలో రష్మికని చూస్తే అదే అభిప్రాయం కలుగుతుంది. సీమ యాస, ఆ ఆహార్యం ఎంతో సహజత్వాన్ని తీసుకొచ్చాయి. రెండో భాగంలోనూ మళ్లీ ఆ పాత్రలతో సందడి చేయనున్న ఈ ఇద్దరి కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే రష్మిక 'పుష్ప2' తర్వాత మరోసారి సీమ సింగారంతోనే తెరపై సందడి చేయనుంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా... రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ పీరియాడిక్ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా రష్మిక దాదాపు ఖాయమైనట్టే. ఇది పూర్తిగా రాయలసీమలోని కర్నూలు నేపథ్యంలో సాగే కథ అని తెలుస్తోంది. సీమ కథ, అందులోనూ పీరియాడిక్ నేపథ్యం కావడంతో... హీరో హీరోయిన్ల పాత్రలు కూడా కథ సాగే ఆ కాలం, ఆ ప్రాంతాన్ని ప్రతిబింబించేలా ఉంటాయని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన సమాచారం. శ్రీవల్లి పాత్ర నుంచి బయటికి రాగానే రష్మిక మరోసారి సీమ పాత్రలో ఒదిగిపోతుందన్నమాట. ఆమె ప్రస్తుతం 'ది గర్ల్‌ఫ్రెండ్', 'కుబేర', 'సికందర్' తదితర చిత్రాల్లో నటిస్తోంది.

డ్రగ్స్ మాట వినబడాలంటే భయపడాలి..

చిరంజీవిని అభినందిస్తున్నా : సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో నేరాలను ఎదుర్కోవడంలో సైబర్ క్రైం టీమ్ సమర్థవంతంగా పని చేస్తోందని.. వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపడం ప్రభుత్వ బాధ్యత. అందుకే పోలీస్ వ్యవస్థకు కావాల్సిన నిధులు, అధికారులను కేటాయించాం. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య సైబర్ క్రైమ్ అని అన్నారు. డ్రగ్స్ మహమ్మారితో కుటుంబం, వ్యవస్థ నాశనమవుతాయి. దురదృష్టవశాత్తు గల్లీ గల్లీలో డ్రగ్స్ వాడకం విచ్చలవిడిగా పెరిగింది. డ్రగ్స్ నియంత్రణకు సిబ్బందిని కేటాయించామని.. గంజాయి మత్తులో నేరాలు జరుగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. చిన్నారులపై జరుగుతున్న దాష్టీకాలకు కారణం మాదకద్రవ్యాలే.. తెలంగాణ యువకులు డ్రగ్స్ కు బానిసలు కాదు.. సమస్యలపై పోరాటం చేసే సమర్థులుగా ఉండాలని సీఎం కోరారు. డ్రగ్స్ నియంత్రణలో సమర్థవంతంగా పనిచేసినవారికి పదోన్నతి కల్పిస్తాం. ఇందుకు సంబంధించి శాసనసభలో చర్చించి చట్టాన్ని రూపొందిస్తాం. మీడియా సమాజంలో సమస్యలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ఇలాంటి కార్యక్రమాలపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు.

డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన కార్యక్రమంలో భాగస్వామి అయిన మెగాస్టార్ చిరంజీవిని అభినందిస్తున్నా. ప్రతీ సినిమా విడుదల సందర్భంలో అదే నటీనటులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా షార్ట్ వీడియో చేయాలి. ప్రతీ సినిమా థియేటర్‌లో సినిమా స్క్రీనింగ్‌కు ముందు డ్రగ్స్ నియంత్రణ, సైబర్ క్రైమ్‌కు సంబంధించి వీడియో ఉచితంగా ప్రదర్శించేలా చూడాలి. ఈ నిబంధనలకు సహకరించినవారికే అనుమతుల విషయంలో ప్రభుత్వం సహకరిస్తుంది. సమాజాన్ని కాపాడాల్సిన సామాజిక బాధ్యత సినీ పరిశ్రమపై ఉంది. తెలంగాణలో డ్రగ్స్ మాట వినబడాలంటే భయపడాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులకు మాత్రమే.. నేరగాళ్లకు కాదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.